## ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

## ఎండీహెచ్‌ఎం పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్‌ఎం) పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీహెచ్‌ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5లోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసిన డిప్యూటీ మేయర్



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పదవి బాధ్యతలు తీసుకున్న ఆర్వీ కర్ణన్‌ను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి.
– సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)

# ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎనిమిదో రోజుకు చేరిన పార్ట్ టైం అధ్యాపకుల నిరవధిక సమ్మె



ఓయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారంతో ఎనిమిదో రోజుకు చేరింది. ఇందులో భాగంగా పార్ట్ టైం అధ్యాపకులు ఓయూ పరిపాలన భవనం గేటు ముందు ధర్నా నిర్వహించారు. పార్ట్ టైం అధ్యాపకులు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన అని చెప్పబడుతున్న పాలనలో తరగతి గదిలో బోధించే యూనివర్సిటీ అధ్యాపకులు రోడ్లపైకి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఏళ్లుగా వర్సిటీ యాజమాన్యం తమను శ్రమదోపిడికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 21లో సైతం తమకు కనీస వెయిటేజ్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అతి తక్కువ వేతనానికి పనిచేసి, తమ విలువైన సమయాన్ని వెచ్చించిన పార్ట్ టైం అధ్యాపకులను రోడ్డు పాలు చేయాలని ఓయూ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం ప్రభుత్వాలు అధ్యాపక భర్తీ చేయనందునే ఇర్రెగ్యులర్ అపాయింట్మెంట్స్ నెలకొన్నాయని, ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని వివరించారు. ఈ సమస్య పట్ల ప్రజా ఆందోళనలు మొదలయ్యే ముందే ప్రభుత్వం బాధ్యతగా మెదులుకోవాలని ఈ సందర్భంగా వారు హితవుపలికారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీని పట్టించుకోకపోవడం బాధాకరమని వారు పేర్కొనారు. దానిని తక్షణమే అమలు చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత



ఆర్థిక సహాయం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 29: అరుణ్‌జ్యోతి కాలనీకి చెందిన ఇల్లందుల పావని శస్త్ర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షల ఆర్థిక సహాయం మంజూరు పత్రాలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యదవ్ లబ్ధిదారురాలి భర్త భరత్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసానికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ప్రేమ్‌కుమార్, అబ్బాస్, నాగభూషణం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సభ సక్సెస్, శ్రేణుల్లో కొత్త జోష్



ఎమ్మెల్యే తలసానిని సన్మానించిన బన్సీలాల్‌పేట్ బీఆర్‌ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 29: బీఆర్‌ఎస్ సభ సక్సెస్ కావడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. లక్షలాది మంది అభిమానులు తరలివచ్చారని, మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను కలిసి సన్మానించి, అభినందనలు తెలిపారు. బస్తీల నుంచి అత్యధిక జనాన్ని సభకు తీసుకుని వెళ్లిన నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు, శాంతికుమార్, ప్రేమ్‌కుమార్, అబ్బాస్, నాగభూషణం, సురేష్, వినోద్, శివకుమార్, గోవర్ధన్, రంజిత్, భరత్, ముక్క శ్రీను పాల్గొన్నారు.

## మౌన దీక్ష, కొవ్వొత్తుల ర్యాలీ



సికింద్రాబాద్, ఏప్రిల్ 29: పెహల్గాంలో జరిగిన ముష్కరుల కాల్పుల్లో మరణించిన వారికి లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం రాత్రి సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద మౌన దీక్ష చేశారు. అనంతరం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్‌తో పాటు కార్పొరేటర్ హేమ, నాయకులు కుంచాల ఏడుకొండల్, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, హరి, భాస్కర్ గిరి, పొట్టి శ్రీను, వినోద్, లష్కర్ కమిటీ సభ్యులు సాధం బాలరాజ్‌యాదవ్, శైలందర్, బాబురావు, కొండల్, అశోక్, అజీజ్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో పార్టీలకు అతీతంగా మౌన దీక్ష చేపట్టిన నాయకులు

## నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలి

బొల్లారం, ఏప్రిల్ 29: ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు చేపట్టే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భూసేకరణ పునరావాస పునరుపాధి కల్పనకై(ప్రజాభిప్రాయ సేకరణ) తిరుమలగిరిలో మంగళవారం నిర్వాసితులతో హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ అపర్ణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. నిర్వాసితులు మూడుసార్లు గ్రామసభ పెట్టిన సమస్యను పరిష్కరించడం లేదన్నారు. 200 ఫీట్ల నుంచి రోడ్డు వెడల్పు 100 ఫీట్లకు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జేఏసీ చైర్మన్ చేలుకుంట సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ నియోజకవర్గానికి రూ.303 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో తిరుమలగిరి మండల డిప్యూటీ తహసీల్దార్ హారిక, ఇంజినీరింగ్ అధికారులు, సభ్యులు ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.




సమావేశంలో నిర్వాసితుల సమస్యలు తెలుపుతున్న జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్తా



ఒకే దేశం, ఒకే ఎన్నిక అంశంపై బీజేపీ దేశవ్యాప్తంగా చర్చా వేదిక నిర్వహిస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్‌బన్సల్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుమలగిరిలోని జయలక్ష్మి గార్డెన్‌లో బీజేవైఎం జాతీయ కోశాధికారి టీం సాయి నేతృత్వంలో సమావేశం జరిగింది. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే దక్షిణ భారత ప్రాంతీయ పార్టీల్లో వారసత్వ రాజకీయాలకు చరమగీతం పాడవచ్చని అన్నారు. దీంతో సుపరిపాలన సాధ్యమని చెప్పారు. జమిలితో సమయం వృథా కాకుండా ఖర్చు తగ్గుతుందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రాంతీయ పార్టీల మనుగడ దెబ్బతింటుందనే ఉద్దేశంతోనే జమిలి ఎన్నికలకు ప్రాంతీయ పార్టీలు సుముఖంగా లేవని విమర్శించారు. **– బొల్లారం, ఏప్రిల్ 29:**

## పద్మారావునగర్‌లో ఉచిత వైద్య శిబిరం




ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న సంకల్పం ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 29: సంకల్పం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పద్మారావునగర్ పోస్టాఫీస్ వద్ద మంగళవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పిల్లల వైద్యులు, దంత, నేత్ర, గైనకాలజీ వైద్యులు హాజరై 200 మంది పిల్లలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను అందజేశారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సామాజిక కార్యకర్తలు లక్ష్మణ్, గోపు రమణ, డా.వెంకట్ ఔషధాలను పంపిణీ చేశారు. భవిష్యత్తులో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సంకల్పం అధ్యక్షురాలు కల్పన, ప్రధాన కార్యదర్శి రజిత, శామల తెలిపారు.

## నూతన కనెక్షన్ పత్రాలు అందజేత



వాటర్ వర్క్స్ విభాగం అధికారి నుంచి పత్రాలు స్వీకరిస్తున్న టీఎన్ శ్రీనివాస్

బొల్లారం, ఏప్రిల్ 29: కంటోన్మెంట్ రెండో వార్డు పరిధిలోని రసూల్‌పురా పోలీస్ లైన్ గన్‌బజార్‌లో నూతనంగా నిర్మించిన మంచినీటి పైప్‌లైన్‌కు నూతన కనెక్షన్ల వివరాలతో కూడిన పత్రాలను మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్‌కు నీటి విభాగం అధికారి శశాంక్ అందజేశారు. ఈ సందర్భంగా రెండో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పాత పైప్‌లైన్ కనెక్షన్ ద్వారా నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు తెలిపారు. పాత పైప్‌లైన్ స్థానంలో నూతన లైన్ నిర్మాణానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు లలిత, శ్యామల, నిర్మల, విజయ లక్ష్మి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

చిక్కడపల్లి, ఏప్రిల్ 29: దివ్యాంగుల చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని వక్తలు అన్నారు. స్పెషల్ స్కూల్స్, ఆటీజం, హియరింగ్ కేంద్రాల్లో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని అన్నారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఐసీ సౌజన్యంతో మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ ఆటీజం అవేరెనెస్ దినోత్సవం నిర్వహించారు. 'దివ్యాంగుల చట్టాల అమలు–అనుభవాలు, మానసిక దివ్యాంగుల సమస్యలు–ప్రభుత్వం చేయాల్సిన కృషి' అంశంపై వక్తలు మాట్లాడారు. ఎన్ఐహెచ్‌హెచ్ ప్రొఫెసర్ రాజేందర్‌కుమార్, ఎల్ఐసీ సీసీ ఇన్‌చార్జి వి.సుబ్రహ్మణ్యం, అలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ అధ్యక్షుడు గిరిదర్‌శర్మ, ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆయుధం లాంటిదని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో, సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్స్ అమలు చేయాలని చట్టంలో ఉన్నదని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం కేంద్ర కమిటీ సభ్యులు వెంకటేష్, సాయమ్మ, యశోద, ఉపేందర్, స్వామి, గంగాధర్, లింగన్న, జయలక్ష్మి, కవిత, భాగ్యలక్ష్మి, చంద్రమోహన్, బాలయ్య, శశికల, భుజంగారెడ్డి, మల్లేష్, ప్రభుస్వామి, శేఖర్‌గౌడ్, కుర్మయ్య, పాముకుంట్ల చందు, లలిత, గౌతమ్, యాదయ్య రాష్ట్ర నాయకులు మంగమ్మ, ఉషా, రాజు, జంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## చలివేంద్రం ఏర్పాటు చేసిన సనత్‌నగర్ పోలీసులు



చలివేంద్రంలో బాటసారులకు నీటిని అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు

అమీర్పేట్ ఏప్రిల్ 29: ఎర్రగడ్డలో సనత్‌నగర్ పోలీసులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో రోడ్లపై బాటసారులకు చల్లటి మంచి నీరు అందించేందుకు వీలుగా సనత్‌నగర్ పోలీసులు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మంగళవారం బాలనగర్ ఏసీపీ హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎస్సై ఫయూమ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ అనివార్యం



అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

బొల్లారం, ఏప్రిల్ 29: తిరుమలగిరి మండల తహసీల్దార్ అశోక్‌కుమార్ పదవి విరమణ కార్యక్రమం మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, నాయకులు అశోక్ కుమార్‌ను ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ మాట్లాడుతూ తహసీల్దార్‌గా అశోక్ కుమార్ విశేష సేవలు అందించారని కొనియాడారు. పదవి విరమణ జీవితంలో ఒక మైలురాయని గుర్తు చేశారు. హారిక, అశోక్, వరప్రసాద్, శశి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డ్యాన్స్ ఫెస్ట్

చిక్కడపల్లి: స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాన్స్ ఫెస్ట్ నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ సూర్యతేజ, వ్యవస్థాపక అధ్యక్షుడు ఇ.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు పసుమర్తి శేషుబాబు, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, దైవజ్ఞశర్మ, పి.ఉమాశంకర్‌రెడ్డి హాజరై నాట్య గురువులకు, కళాకారులను ఘనంగా సన్మానించారు. నాట్య ప్రతిభను ప్రోత్సహిస్తామని చెప్పారు.

# రైలు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి




సెల్ ఫోన్లు అందజేసిన అనంతరం బాధితులతో రైల్వే ఎస్పీ చందన దీప్తి

అడ్డగుట్ట, ఏప్రిల్ 29: చోరీలకు గురైన సెల్ ఫోన్లను గుర్తించేందుకు సీఈఐఆర్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని రైల్వే ఎస్పీ చందన దీప్తి అన్నారు. ఇటీవల రైల్వే స్టేషన్ రైల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న, చోరీలకు గురైన సెల్ ఫోన్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని సంబంధిత యజమానులకు మంగళవారం సాయంత్రం అప్పగించారు. ఈ మేరకు లాలాగూడలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ చందనా దీప్తి వివరాలను వెల్లడించారు. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో ప్రయాణికులు తమ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అదమరిస్తే చోరీలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, రైల్వే పోలీసులు ప్రయాణిస్తున్న భద్రతకై ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నారని ఆమె తెలిపారు. ప్రయాణికులు తమకు సహకరించి జాగ్రత్తలను పాటించాలని ఆమె సూచించారు. ఇటీవల చోరీలకు గురైన ప్రయాణికులు పోగొట్టుకున్న రూ. 15 లక్షల విలువగల 150 సెల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కేవలం తెలంగాణతోపాటు కేరళ, యూపీ, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్ , తమిళనాడు, ఏపీల్లో చోరీలకు గురైన సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 19 ఏప్రిల్ 2023 నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.99 లక్షల విలువగల 990 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం 150 సెల్ ఫోన్లను సంబంధిత యజమానులకు అప్పగించినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో రైల్వే డీఎస్పీలు జావేద్, ఇన్‌స్పెక్టర్లు ఆర్.ఎల్లప్ప, సాయి ఈశ్వర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హత్యకేసు ఛేదించిన దోమలగూడ పోలీసులు

### వివరాలు వెల్లడించిన సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి



విలేకరుల సమావేశంలో హత్య వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి

కవాడిగూడ, ఏప్రిల్ 29: యువకుడి దారుణ హత్య కేసును దోమలగూడ పోలీసులు 24 గంటల్లో ఛేదించి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి గాంధీనగర్ ఇన్‌చార్జి ఏసీపీ గురురాఘవేంద్ర, దోమలగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి వివరాలను వెల్లడించారు. చేపూరి నరేందర్(40) నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన పాత నేరస్తుడు. కూలీ పనులు చేసుకుంటూ పుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నాడు. చిక్కడపల్లి పీఎస్ పరిధిలో మర్డర్ కేసులో ఇటీవల జైలు జీవితం గడిపి విడుదలైన చేపూరి నరేందర్‌కు హిమాయత్‌నగర్‌లో పుట్‌పాత్‌పై జీవనం సాగించే ఆసిఫాబాద్ కొమురంబీం జిల్లాకు చెందిన అజయ్(32)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ప్రతి రోజూ పనికి వెళ్తుండేవారు. కాగా చేపూరి నరేందర్ తాను చేసిన పనులు ఇటీవల అజయ్‌కి చెప్పాడు. నరేందర్ చెప్పిన మాటలను పనికి వెళ్లిన చోట అజయ్ తోటివారికి చెప్పడంతో నరేందర్‌ను పనులకు నిరాకరించేవారు. దీంతో అజయ్ పైన నరేందర్ కక్ష్య పెంచుకున్నాడు. అజయ్‌ను అడ్డు తొలగించుకోవాలని అనుకున్న నరేందర్ 27వ తేదీ అర్ధ రాత్రి నిదురపోతున్న అజయ్ తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేశాడు. అనంతరం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రక్కనే ఉన్న లిఫ్ట్‌లో పడేసి వెళ్లిపోయాడు. జిప్లాజా అపార్టుమెంట్ వాచ్‌మెన్ దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. అజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. సెంట్రల్‌జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, దోమలగూడ పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలతో పాటు సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడు చేపూరి నరేందర్‌గా గుర్తించారు. మంగళవారం ఉదయం జూబ్లీబస్‌స్టేషన్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించారు. అతన్ని బండరాయితో మోది చంపినట్లు అంగీకరించినట్లు డీసీపీ శిల్పవల్లి తెలిపారు. నరేందర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ వివరించారు. మృతుడి ఒంటిపై బట్టలు లేకపోవడంతో అతనిపై లైంగిక దాడి జరిందా అన్న అనుమానాలు ఉన్నాయని, ఆ కోణంలో కూడా దర్యాప్తు జరుపుతున్నామని, అదే విధంగాఈ ఘటనలో ఇంకెవరైనా నిందితునికి సహకరించారా అన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు డీసీపీ శిల్పవల్లి తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అడ్డగుట్ట, ఏప్రిల్ 29: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 45 సంవత్సరాల వయసుగల వ్యక్తి ఈస్ట్ మారేడుపల్లి రాంసార్ హోటల్ ఎదురుగా ఉన్న రియో రెస్టారెంట్ వద్ద పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి తుకారం గేట్ పోలీసులు చేరుకున్నారు. 108 సిబ్బంది కూడా అక్కడికి చేరుకొని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

**లాల్‌బజార్‌లో...**

బొల్లారం: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి లాల్‌బజార్ ప్రాంతంలో ఈనెల 28న గుర్తుతెలియని వ్యక్తి సుమారు (50) లాల్‌బజార్ మేరీ మాత విగ్రహం వెనుక భాగంలో విగత జీవిగా పడి ఉన్నాడు. అదే సమయంలో ఓ మహిళ వాకింగ్ నిమిత్తం తన పిల్లలతో కలిసి వెళుతోంది. గమనించిన మహిళ దగ్గరికి వెళ్లి చూసేసరికి ఆ వ్యక్తి మరణించినట్లు ఉంది. వెంటనే తిరుమలగిరి పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 29: గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ పది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పంచాయతీ కార్యదర్శులు అన్ని తానై నడిపిస్తూ గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోయినా ప్రజలకు తాగునీటికీ ఇబ్బందులు రాకుండా చూస్తున్నమని తెలిపారు. పెండింగ్ బిల్లులు విడుదల కాకపోతే పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలు భవిష్యత్తులో ఆర్థికంగా చితికి పోయే ప్రమాదం ఉందని అన్నారు.